నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, గురువారం 16 మే 2024 | KHAMMAM


## సివిల్ సబ్ కోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మధిర, మే 15: మధిర మండలంలో బుధవారం పర్యటించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్.. సివిల్ సబ్ కోర్టు ఏర్పాటు కోసం ఇక్కడి భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం మధిరకు సంబంధించిన సివిల్ కేసులన్నీ సత్తుపల్లి కోర్టులో విచారణ జరుగుతున్నాయి. ఈ క్రమంలో మధిరకు కోర్టు మంజూరైనప్పటికీ ఏర్పాటుకు భవనాలు లేవు. దీంతో మధిర మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు పలుసార్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి కోర్టు ఏర్పాటుపై వినతులు అందజేశారు. దీంతో బుధవారం ఆయన స్వయంగా మధిర వచ్చి కోర్టు ఏర్పాటుకు అనువుగా ఉండే పలు భవనాలను పరిశీలించారు. మధిర మున్సిఫ్ మెజిస్ట్రేట్ జడ్జి కార్తీక్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల అప్పారావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, మధిర సీఐ మధు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత

### జిల్లా ఆర్వో, కలెక్టర్ వీపీ గౌతమ్



స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 15 : ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన కలెక్టర్ విధుల్లో ఉన్న సాయుధ బలగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద ఏర్పాటు చేసిన లైట్లు 24 గంటలపాటు నిరంతరాయంగా వెలగాలన్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద సీసీ కెమెరాల వ్యూ కోసం ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరలను పరిశీలించి.. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంట్రీ పాస్ ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే స్ట్రాంగ్‌రూంల పరిశీలనకు అనుమతించాలన్నారు. అలాగే కౌంటింగ్ రూంల వద్ద ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ పీ.మౌనిక, అదనపు కలెక్టర్ డీ.మధుసూదనాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యాంప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పట్టా ఉన్నా ఎల్ ఆర్ఎస్ కట్టాల్సిందే..



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

- కొత్తగా ఇల్లు నిర్మించుకునేవారికి గుదిబండ!
- 1985కంటే ముందు ఇంటి పన్ను రశీదు ఉండాల్సిందే..
- లేదంటే ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ ఫీజు తప్పదు
- ఆందోళనలో ఇంటి యజమానులు

కొత్తగూడెం అర్బన్, మే 15 : అక్రమంగా లేఔట్లు, వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసినవారు, ఇండ్లు నిర్మించుకున్నవారు లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) ఫీజు చెల్లించాలని ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. 2020 ఆగస్టు కంటే ముందు వెంచర్లు, లే ఔట్‌లలో స్థలం కొనుగోలు చేసిన వారం దరూ స్టాంప్ డ్యూటీ చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవాల్సిందిగా గృహ యజమానులకు అవకాశం కల్పించింది. కానీ కొత్తగా మున్సిపల్ అధికారులు మరో నిబంధనను తెరపైకి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ 373, 76 జీవోల ద్వారా ఇంటి క్రమబద్ధీకరణ పట్టాలు పొందినవారు సైతం కొత్తగా ఇండ్లు నిర్మించుకోవాలనుకుంటే భవన నిర్మాణ అనుమతి ఫీజుతోపాటు ఎల్ఆర్ఎస్ ఫీజు సైతం చెల్లించాలని చెబుతున్నారు. దీంతో టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్న ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు.

### పట్టా ఉన్నా ఎల్ఆర్ఎస్ చెల్లించాల్సిందే...

కొత్తగూడెం మున్సిపాలిటీ తొలుత నోటిఫైడ్ ఏరియా నుంచి మున్సిపాలిటీగా 2000 సంవత్సరంలో రూపాంతరం చెందింది. అప్పటివరకు ఇంటిపై ఎవరికి యాజమాన్య హక్కులు సైతం ఇంటి యజమానులకు లేవు. అవసరానికి ఇండ్లు అమ్ముకుందామన్న, పిల్లల పెళ్లిళ్ల కోసం, పై చదువులకోసం రుణాలు తీసుకుందామనుకున్న, వారసత్వంగా ఆస్తిని ఇవ్వాలనుకున్న ఎటువంటి హక్కులు ఉండేవికావు. ఇండ్లను క్రమబద్ధీకరించాలని అనేక పోరాటాలు చేయగా 2007లో 373 జీవో ద్వారా ఆనాటి ప్రభుత్వం ఇంటి క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేసింది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక మాజీ సీఎం కేసీఆర్ జీవో నెంబర్ 76ద్వారా మరోమారు మిగిలి ఉన్న ఇండ్లకు క్రమబద్ధీకరణ పట్టాలు ఇచ్చారు. తద్వారా మొత్తం సుమారు 15వేల ఇండ్లకు రెగ్యులరైజ్ చేస్తూ క్రమబద్ధీకరణ పట్టాలను అందజేశారు. ఇంతవరకు బాగానే ఉంది.. కానీ కొత్తగా ఇప్పుడు ఇంటిని నిర్మించుకునేవారు మరోసారి ల్యాండ్ రెగ్యులరైజ్ చేసుకోవాలని దానికి రుసుము చెల్లించాలని చెప్పడంతో గృహ యజమానులు అవ్వాకవుతున్నారు.

### 1985కంటే ముందు పన్ను రశీదు ఉండాల్సిందే...

కొత్తగా ఇంటిని నిర్మించుకుందామని గృహ యజమానులు టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకుంటే 21రోజుల్లోనే అన్ని అనుమతులు వచ్చేలాగా గత ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చింది. ఇంటి క్రమబద్ధీకరణ పట్టా ఉన్నవారు పాత ఇంటిస్థానంలో దానిని కూల్చి కుటుంబ అవసరాల నిమిత్తం కొత్త ఇంటిని నిర్మించుకోవాలంటే ప్రస్తుతం టీఎస్ బీపాస్‌లో భవన నిర్మాణ అనుమతి ఫీజుతోపాటు ఎల్ఆర్ఎస్ ఫీజును సైతం చెల్లించాల్సిందిగా ప్రస్తుతం మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. 1985కంటే ముందు ఇంటి పన్ను రశీదు ఉంటే ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ రశీదు లేకుంటే కచ్చితంగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాలంటున్నారు. 200 గజాల్లో జీ ప్లస్ వన్‌కు అనుమతి తీసుకోవాలంటే సుమారు 40వేలు ఫీజు చెల్లించాల్సి ఉండగా ఇక ఎల్ఆర్ఎస్ ఫీజు కూడా అప్పటి భూమి విలువ ప్రకారం చెల్లించాలంటే సుమారు లక్షకు పైగానే అవుతోంది. ఫలితంగా ఇండ్లు నిర్మించుకోవాలంటే సుమారు రెండులక్షల వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుందని గృహ యజమానులు వాపోతున్నారు.

### కొత్తగా ఇంటిని నిర్మించుకునే వారికి ఇబ్బందే..

భవన నిర్మాణ అనుమతికి చెల్లించాల్సిన ఫీజుతో పాటు ఎల్ఆర్ఎస్ ఫీజు కూడా చెల్లించాలంటే ఇంటి యజమానులకు ఆర్థిక భారం తప్పదు. 1985నాటి ఇంటి పన్ను తీసుకురావాలంటే సాధ్యమయ్యేపని కాదు. దాదాపు 40సంవత్సరాల క్రితం రశీదు తేవడం కుదిరేపని కాదు. ప్రతి రశీదును ఇంట్లో భద్రపరుచుకోవడం కష్టమైన పని. ఇప్పుడు రశీదు అధికారులకు అందజేయనిపక్షంలో బీఆర్ఎస్, ఎల్ఆర్ఎఫ్ ఫీజు కట్టడమంటే ఎంతలేదన్న సుమారు లక్షన్నర వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇంతపెద్దమొత్తంలో ఆర్థిక భారం మోపడం మున్సిపల్ అధికారులకు తగదు. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలి. ప్రజాప్రతినిధులు సైతం దృష్టిసారించి ఇంటిని నిర్మించుకునే వారికి ఉపశమనం కల్పించాలి.

– చావా సంగారావు, సింగరేణి ఉద్యోగి

### రశీదు లేకుంటే ఎల్ ఆర్ఎస్ చెల్లించాల్సిందే..



కొత్తగా ఇంటిని నిర్మించుకునేవారు బిల్డింగ్ అనుమతి ఫీజుతోపాటు 1985 కంటే ముందు రశీదు కూడా అధికారులకు అందజేయాలి. రశీదు లేనిపక్షంలో ఎల్ఆర్ఎస్ ఫీజు కచ్చితంగా చెల్లించాల్సిందే. మున్సిపాలిటీకి ఇంటి పన్నులు మినహా ఇతర ఆదాయ వనరులేవీ లేవు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతోంది. రశీదు లేని వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

– టి.శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్

## ఆగస్టు 15 నాటికి 'సీతారామ' నీళ్లు అందిస్తాం..

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సీతా రామ ప్రాజెక్టు కాల్వ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

వైరాటౌన్, మే 15 : ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్టును ప్రారంభించి లింక్ కెనాల్ ద్వారా సాగునీరు అందిస్తామని, రైతుల సాగు భూములకు నీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏన్కూరు మండల కేంద్రంలో సీతారామ ప్రాజెక్టు కాల్వ పనులను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెయిన్ కెనాల్ నాలుగు పంప్‌హౌస్‌లతోపాటు మేజర్ పనులన్నీ పూర్తయ్యాయని, సీతారామ ప్రాజెక్టు నీటిని వైరా రిజర్వాయర్‌కు తరలించి ఆయకట్టు భూములకు ఈ ఏడాది నుంచే నీరందిస్తామన్నారు. కృష్ణా జలాలు మనకు రాకపోయినా గోదావరి జలాల ద్వారా కృష్ణా ఆయకట్టు కింద పంటలు పండించుకోవడంతోపాటు వైరా రిజర్వాయర్ ద్వారా తాగునీటితోపాటు ఆయకట్టు భూములకు నీరందిస్తామని తెలిపారు. అలాగే మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని భూములకు లంకాసాగర్ ప్రాజెక్టు ద్వారా నీరందిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగూడెం జిల్లాకు వచ్చినప్పుడు ఈ ప్రాజెక్టు గురించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తాను వివరించగానే ముఖ్యమంత్రి స్పందించి త్వరగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సూచన మేరకు పనులు మొదలు పెట్టామని, రైతులకు కొంత ఇబ్బంది జరిగినా పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు.

నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, బానోతు హరిప్రియ, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, జిల్లా నాయకుడు ఆర్జేసీ కృష్ణ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ తదితరులు హాజరయ్యారు.





## డీసీఎంఎస్ మాజీ చైర్మన్ 'రాయల' మృతి

### అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో కన్నుమూత



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఖమ్మం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు (ఫైల్)

సత్తుపల్లి, మే 15: ఖమ్మం డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాయల వెంకట శేషగిరిరావు (70) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో బుధవారం కన్నుమూశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రాయల వెంకట శేషగిరిరావు 1978లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1982లో స్వర్గీయ నందమూరి రామారావు పిలుపు మేరకు అప్పట్లో టీడీపీలో చేరారు. 1987లో తల్లాడ మండల తొలి ఎంపీపీగా పనిచేశారు. ఆ తరువాత తల్లాడ మండలం గంగదేవిపాడు సహకార సొసైటీ అధ్యక్షుడిగా మూడుసార్లు పనిచేశారు. 2014 నుంచి 2019 వరకు డీసీసీబీ డైరెక్టర్‌గా, 2019 నుంచి 2023 వరకు డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిచేశారు. 2018లో అప్పటి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెంట బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ బలోపేతానికి అవిరళ కృషిచేశారు. రాయల వెంకట శేషగిరిరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ఆయన అంత్యక్రియలు గురువారం తల్లాడ మండలంలోని తన స్వగ్రామమైన మిట్టపల్లిలో జరుగుతాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాయల మృతి పట్ల బీఆర్ఎస్ సహా పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

### శేషగిరిరావు మృతిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. దశాబ్దాలకాలంగా వారితో తనకున్న రాజకీయ అనుబంధాన్ని, రైతాంగం కోసం, ప్రజల కోసం, పార్టీ కోసం శేషగిరిరావు చేసిన కృషిని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

### రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన

నీలగిరి, మే 15 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి ఆమె పాల్గొని ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు వివరించారు. శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన విషయాలు, పాటించకూడని అంశాలపై అభ్యర్థులకు బుధవారం జరిగిన సమావేశంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఏఆర్ఓలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మ్యానువల్‌గా ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల లాగానే ఎఫ్ఎస్‌టీ బృందాలు కొనసాగుతాయని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేశ్‌కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, చండూరు ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం, మిర్యాలగూడ ఏఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వ్యర్థాల కాల్చివేత అనర్థం

- సాగు భూమిలో సారం కోల్పోయే ప్రమాదం
- మిత్ర పురుగులు మరణిస్తే చేనుకు మరింత నష్టం
- సేంద్రియ ఎరువుల వినియోగమే మిక్కిలి శ్రేష్టం
- సారం పెంపుదలే అధిక దిగుబడులకు సరైన మార్గం
- చేలల్లో చెత్తను కాల్చవద్దంటూ నిపుణుల స్పష్టం



కూసుమంచిలో వరి అయిపోయిన తర్వాత వ్యర్థాలను కాల్చిన పొలం



చేలకు పశువుల ఎరువు తోలుతున్న రైతులు

సాగు భూమిలో సారం క్రమంగా తగ్గిపోతోంది. లాభాల కోసం వ్యాపారులు అంటగట్టే రసాయన ఎరువులతో ఇప్పటికే చేవ కోల్పోతున్న చేను.. అవగాహన లేమి కారణంగా కొందరు రైతులు చేస్తున్న తప్పిదాలతో మరింత ప్రమాదంలో పడుతోంది. దీని కారణంగా మరోవైపు పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా మరణిస్తున్నాయి. దీంతో క్షారం పూర్తిగా తగ్గిపోయే ప్రమాదమూ లేకపోలేదు. అందుకే పంట చేలలోని వ్యర్థాలను ఎప్పుడూ కాల్చవద్దని, ఎండిన వ్యర్థాలను పొలంలోనే కలియదున్నాలని వ్యవసాయ శాఖ నిపుణులు సూచిస్తున్నారు.

కూసుమంచి, మే 15 : ఇప్పటికే విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయన ఎరువులతో సాగు భూమి రోజురోజుకూ తన సారాన్ని కోల్పోతోంది. ఈ తరుణంలో రైతులు తమ పంటల వ్యర్థాలను చేలలోనే కాల్చుతుండడంతో మరింత ప్రమాద ఏర్పడుతోంది. పంటలకు మేలు చేసే పురుగులు భూమిలోనే నివసిస్తుంటాయి. సాగు సమయంలో అవి మేల్కొని విత్తనాలను, వేర్లను ఆశించే క్రిమికీటకాలను సంహరించి ఆరగిస్తుంటాయి. ఇలా పంటలకు ఎంతో మేలు చేకూరుస్తాయి. కానీ.. సహజంగానే వేసవిలో రైతులు పంటల వ్యర్థాలను చేనులో ఒక చోట చేర్చి కాల్చివేస్తుంటారు. కొన్ని పంటలనైతే ఎక్కడివి అక్కడే ఉంచి నిప్పు అంటిస్తుంటారు. దీంతో ఆ మంటలు చేను అంతటా విస్తరించడంతో సాగు భూమిలోని అన్ని చోట్లా ఉన్న మిత్ర పురుగులు చనిపోతున్నాయి. దీంతో తదుపరి సాగు సమయంలో క్రిమికీటకాలు, తెగుళ్లు ఎక్కువై పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో రైతులు ఎంతగా శ్రమించినప్పటికీ ఆర్థికంగా నష్టపోతున్నారు.

### ఇలా చేస్తే మేలు..

పంటల దిగుబడి పెరగాలన్నా.. చీడపీడలు ఆశించకుండా ఉండాలన్నా ముఖ్యంగా సాగు భూమి సారవంతమైనదై ఉండాలి. బలమైన ఖనిజ లవణాలు, పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి. అందుకోసం పంటలు అయిపోయిన తరువాత వ్యర్థాలను తొలగించుకోవాలి తప్ప కాల్చకూడదు. వేసవిలో తొలగించడం సాధ్యం కాకపోతే తొలకరి రోజుల్లో భూమి తడిసిన తరువాత వ్యర్థాలను పూర్తిగా తీసివేయాలి. లేకుంటే నీళ్లు పెట్టి కుళ్లిన తరువాత భూమిలో కలియదున్నాలి. మరీ ముఖ్యంగా వేసవిలో పశువులు పెంటను చేనులో తోలాలి. పచ్చి రొట్టను పెంచాలి. గొర్రెలు, మేకలు వంటి జీవాలను పొలంలో ఎక్కువ రోజులు ఉంచాలి. వాటి పెంట భూమికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే, వేప కషాయాలు, గోమూత్రాలు, పంచామృతాలు వంటివి కూడా వినియోగించాలి. దీంతో భూసారం మరింతగా వృద్ధి చెందుతుంది. దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి.

### భూసారం పెంచుకుంటేనే అధిక దిగుబడులు



అవగాహన లేమి, తక్కువ శ్రమ వంటి కారణాల వల్ల కొందరు రైతులు తమ చేలల్లోని పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో పంటలకు మేలు చేసే మిత్రపురుగులు సాగు భూమిలోనే చనిపోతున్నాయి. ఫలితంగా దిగుబడులు తగ్గిపోతాయి. అయితే దిగుబడులను కృత్రిమంగా పెంచడం కోసం చాలామంది రైతులు రసాయన ఎరువులను అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. ఇది సాగు భూమికి మరింత నష్టం చేకూరుస్తుంది. అందుకని చేలలోని పంట వ్యర్థాలకు రైతులెవరూ నిప్పు పెట్టొద్దు. సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించాలి. ఇలాంటి పద్ధతులతో భూసారాన్ని పెంచుకుంటేనే అధిక దిగుబడులు వస్తాయి.

–వాణి, ఏవో, కూసుమంచి